వరద బాధితులకు విరాళం

విశాలాంధ్ర – సాగర్ నగర్: వరద బాధితులను ఆదుకునేందుకు గాను 8వ వార్డు పరిధిలోని పలువురు ప్రముఖులు మంత్రి నారా లోకేష్‌కు విరాళాన్ని అందజేశారు. విశాఖకు చెందిన పీఎస్ మస్తాన్ రావు, కుంకుమ రేఖ, భరత్, శ్రీ లేఖ (హిందూస్థాన్ ఎంటర్ ప్రైజెస్) రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదలకై
జీవీఎంసీ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం

మూడు రోజులపాటు సాగిన కౌన్సిల్
81 అంశాలు ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని కోరుతూ జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. టేబుల్ ఎజెండాలో 8వ అంశాన్ని అన్ని పార్టీలు కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విశాఖ నగర మేయర్ సారాధ్యంలో అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు ప్రధానమంత్రిని, రాష్ట్ర ముఖ్యమంత్రిని, కేంద్ర స్టీల్ మంత్రిని, రాష్ట్ర డిప్యూటీ సీఎంను కలిసి స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరేందుకు కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానాన్ని వారికి తెలియజేసేందుకు పెట్టిన అంశాన్ని ఆమోదించారు. సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏ జే స్టాలిన్‌తోపాటు సీపీఎం ఫ్లోర్ లీడర్ గంగారావు అనేక అంశాలను మూడు రోజులపాటు జరిగిన ఈ కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తారు. కౌన్సిల్ చరిత్రలో తొలిసారిగా మూడు రోజులపాటు కొనసాగిన సమావేశాల్లో అనేక అంశాలతో పాటు అజెండా అంశాలను ఆమోదించుకున్నారు. నగరంలో పారిశుద్ధ్య పనుల్లో చెత్తను తరలించే క్లాప్ వాహనాల నిర్వహణపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సక్రమంగా వాహనాలు నడవడం లేదని, చెత్త తరలించే ట్రిప్పులను ఒకటి, రెండింటికే పరిమితం చేస్తున్నారని కొంతమంది సభ్యులు తెలియజేశారు. మెకానికల్ విభాగంలో వాహనాలు నిర్వహణ, అద్దెలు చెల్లింపులపై తీవ్ర అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు సభ్యులు తెలియజేశారు. వాహనాల డీజిల్ వాడకంతో పాటు జిపిఎస్ ఏర్పాటు సక్రమంగా లేదని మండిపడ్డారు. ముడసర్లోవ పార్క్ సమీపంలో ఉన్న 836 ఎకరాల జీవీఎంసీ స్థలాన్ని అనేకమంది ఆక్రమణలు చేపట్టారని 22వ వార్డు కార్పొరేటర్ మూర్తి యాదవ్ తెలియజేశారు. 52 ఎకరాలు రైల్వే జోన్‌కు అప్పగించినట్లు కమిషనర్ ఈ సందర్భంగా తెలియజేశారు. కేవలం 85 ఎకరాల్లో మాత్రమే కన్సల్టెన్సీ ద్వారా మూడు దశల్లో ముడసర్లోవలో భూములను ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తామని కమిషనర్ చెప్పారు. గుర్రాల పార్కు పనులు నిలుపుదల చేశామన్నారు. అజెండాలో ఉన్న అంశాలపై కొంతమంది సభ్యులు తమ అనుమానాలను నివృత్తి చేసుకుని ఆమోదానికి జై కొట్టారు. ఈ సమావేశంలో 81 అంశాలు ఆమోదం పొందాగా, 1 అంశం వాయిదా వేయగా, 1 అంశాన్ని తిరస్కరించారు. గురువారం జీవీఎంసీ సర్వసభ్య (సాధారణ) సమావేశం కొనసాగింపు చర్యల్లో భాగంగా మధ్యాహ్నం రెండున్నర గంటలకు ప్రారంభమైంది. జీవీఎంసీ సర్వసభ్య సమా వేశంలో అజెండాలో 48 అంశాలు, అనుబంధ అజెండాలో 27 అంశాలు, టేబుల్ అజెండాలో 8 అంశాలు కలిపి మొత్తంగా 83 అంశాలను పొందుపరచగా, సభ్యులు చర్చించి 81 అం శాలను ఆమోదించారు. 1 అంశాన్ని వాయిదా వేయగా, మరో ఒక్క అంశాన్ని తిరస్కరించడం అయిందని మేయర్ తెలిపారు. జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో జీరో అవర్‌లో అందరు కౌన్సిల్ సభ్యులు వారి వారి వార్డుల్లో సమస్యలను కౌన్సిలకు తెలియజేశారు. కౌన్సిల్ సభ్యులు వారి వార్డుల్లో తెలియపరచిన సమస్యలకు సంబంధించిన అంశాలను పరిగణన లోనికి తీసుకొని పరిష్కార దిశగా కార్యాచరణను చేపట్టాలని, అలాగే సభ్యులు అజెండాలలో పలు అంశాలను ఆమోదిస్తూ వాటిలో కొన్నిటిపై కోరిన వివరాలపై కూడా సభ్యులకు సమాచారాన్ని అందించే ఏర్పాట్లను చేయాలని కమీషనర్‌కు మేయరు ఆదేశించినట్లు తెలిపారు.

జగన్‌తో మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ సమావేశం

విశాలాంధ్ర – పెందుర్తి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విజయవాడలో నిర్వహించిన అనకాపల్లి జిల్లా వైసీపీ ముఖ్య నాయకుల సమావేశానికి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ హాజరయ్యారు. పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించిన ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను జగన్మోహన్ రెడ్డికి సుదీర్ఘంగా చర్చించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దిగజారుడు రాజకీయాలతో ప్రజలు పడుతున్న బాధలను వివరించారు. ముఖ్యంగా అనకాపల్లి జిల్లాలో అమలవుతున్న ప్రజావ్యతిరేక విధానాలను జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అండగా నిలవాలని సూచిస్తూ, పార్టీ బలోపేతానికి రూపొందించిన ప్రణాళికలను జగన్మోహన్ రెడ్డి అదీప్ రాజ్‌కు వివరించినట్లు పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది.

క్షేత్ర స్థాయిలో ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూముల పరిశీలన

విశాలాంధ్ర – ఆనందపురం: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ ఆదేశాలతో గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూములు, పత్రాలు పరిశీలన గురువారం విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ చేశారు. ఆయన పలు సచివాలయాల్లో క్షేత్రస్థాయిలో ఫ్రీ హోల్డ్ భూములను ముందుగా సందర్శించి అనంతరం పత్రాలు పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అందులో భాగంగా రైతులు సమ్మతితోనే ఆన్లైన్ అయ్యాయా లేక మధ్యవర్తులు ప్రమేయంతో ఏవైనా మార్పులు చేశారా అనే అంశంపై రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అందులో భాగంగా పాలవలస, పందలపాక, చందక, పేకేరు, గొట్టిపల్లి, గిడిజాల, కోలవానిపాలెం, మామిడిలోవ, తంగుడుపల్లి సచివాలయాల్లో భూ రికార్డులు పరిశీలన జరిపి నేరుగా రైతులను రప్పించి వివరాలు సేకరించారు. ఆర్డీవోతో పాటు మండల డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, వీఆర్వోలు శ్రీనివాసరావు, స్వామి, సర్వేయర్లు రెవెన్యూ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు, యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి
మంత్రి నారా లోకేష్‌కు ఏఐవైఎఫ్ వినతి

విశాలాంధ్ర – పెందుర్తి: జిల్లాలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉండిపోయిన అనేక సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నేతలు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిపిల్లి రాంబాబు విశాఖ పర్యటనలో ఉన్న మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. పెందుర్తి మండలంలో ఏళ్ల తరబడి డిగ్రీ కళాశాల లేకపోవటంతో వందల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసుకొని నగరానికి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇందులో ఆడపిల్లలు 50 శాతం ఉన్నారని తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం గెలిస్తే రాష్ట్రంలో వాలంటీర్లకు 10 వేలు వేతనం ఇస్తామని, యువతకు ఉద్యోగావకాశాలు ఎక్కువగా లభించేలా కృషి చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కావస్తున్నా వాలంటీర్లకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం అందకపోగా, ఉద్యోగ భద్రత కూడా లేదన్నారు. రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ విధానాన్ని, కోట్ల మంది ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వానికి కృతజ్ఞత తెలుపుతు న్నామని, అయితే ఎ.పి బేవరేజెస్‌లో పని చేస్తున్న 15 వేల మందికి మరో ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత వివరాలను ఉపాధి కార్యాలయాల ద్వారా సేకరించి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, లేదా ఎన్నికల హామీ ప్రకారం 3 వేల నిరుద్యోగ భృతి చెల్లించాలని కోరారు.

మద్యం దుకాణాల సిబ్బందిని ఆదుకోవాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర – విశాఖ: రాష్ట్రంలో నూతన మద్యం విధానం వల్ల 15 వేల మంది ఉపాధి కోల్పోనున్నారని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెంగువ అచ్యుతరావు, ప్రధాన కార్యదర్శి వై. రాంబాబు అన్నారు. అల్లిపురం నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో ఏఐవైఎఫ్ జిల్లా సమితి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే 2.60 లక్షల మంది వాలంటీర్లు నిరుద్యోగులయ్యారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి, అధికారం చేపట్టిన తర్వాత 2.60 వేల మంది వాలంటీర్లను కూటమి ప్రభుత్వం నిరుద్యోగులుగా మార్చిందని వాపోయారు. ఇప్పుడు ఏపీ బెవరేజెస్ మద్యం దుకాణాల సిబ్బంది 15 వేల మందిని అర్ధాంతరంగా రోడ్డున పడేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 5 సంవత్సరాల నుంచి ప్రభుత్వం మద్యం దుకాణంలో చాలీచాలని జీతాలతో ఉద్యోగాలు కొనసాగించారని, వీరంతా ఒక్కసారిగా ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మద్యం దుకాణాల సిబ్బందికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వాలంటీర్ల సమస్యలపై ఈ నెల 26 నుంచి అక్టోబర్ 2 వరకు గాంధీ మార్గంలో శాంతియుతంగా నిరసన తెలియ జేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు వాలంటీర్లకు గౌరవ వేతనం 10 వేల రూపాయలు ఇవ్వాలని, వాలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి హామీపై కూటమి నేతలు స్పందించడం లేదని అన్నారు. తక్షణమే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని అన్నారు. సమస్యలపై ఏఐవైఎఫ్ ప్రత్యక్ష ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మధు, శివ, లక్ష్మీనారా యణ, సింహాద్రి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వంలో పల్లా

విశాలాంధ్ర – కూర్మన్నపాలెం: స్థానిక 86వ వార్డు పరిధిలో గల రాసాలమ్మ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ నల్లూరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. గడిచిన 100 రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలని రాష్ట్ర ప్రజల దృష్టికి తీసుకు వెళ్లడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని అన్నారు. కూటమి ప్రభుత్వం మీద రాష్ట్ర ప్రజలకు పూర్తి నమ్మకం ఏర్పడిందని అన్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే రాష్ట్రంలో ప్రజలకు పూర్తి స్వేచ్ఛ వాక్కు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లేళ్ళ కోటేశ్వరరావు, వార్డు టీడీపీ నాయకులు నల్లూరి సూర్యనారాయణ, మాడిశ కనకరాజు, జనసేన నాయకులు గంధం వెంకట్రావు, కాదా శ్రీను, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న మంత్రి నారా లోకేష్
లోకేష్ అనుసరించిన తీరుకు అంతా హాట్సాఫ్

విశాలాంధ్ర – సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారిని రాష్ట్ర హెచ్.ఆర్.డి., ఐ.టి శాఖ మంత్రి నారా లోకేష్, విశాఖ ఎం.పి భరత్ సింహాచలం శాసన సభ్యులు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, బండారు తదితరులు దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి త్రినాథరావు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అర్చక బృందం వేద, నాదాలతో మంత్రికి పూర్ణకుంభంతో సంప్రదాయంగా స్వాగతం పలికారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకున్న మంత్రి లోకేష్ మనసులోని కోరికలను సింహాద్రి అప్పన్నకు నివేదించుకున్నారు. అంతరాలయంలో అర్చకులు లోకేష్ పరివారం పేరున అష్టోత్తరశతనామార్చన చేశారు. స్వామివారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలను ఈఓ మంత్రికి అందజేసారు. 32 నారసింహ అవతారాలతో దేవస్థానం ముద్రించిన పుస్తకాన్ని స్థానాచార్యులు డాక్టర్ టి.పి.రాజగోపాల్ ప్రత్యేకంగా మంత్రికి అందజేసి విశేషాలను తెలియజేశారు. కార్పొరేటర్ పిసిని వరహా నరసింహం, గండి బాబ్జీతో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అప్పన్న దర్శనానికి వచ్చి వెళ్లిన తీరు దేవస్థానం వర్గాల్లోనే కాక భక్తుల్లో కూడా చర్చనీయాంశమైంది. కాస్తా హోదా ఉంటే చాలు రాజగోపురం వరకు వాహనాల్లో వచ్చేసి హడావుడి చేసే ప్రజా పతినిధులకు మార్గ నిర్దేశం చేసేలా లోకేష్ అనుసరించిన తీరు పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కొండపైన సమాచారా కేంద్రం వద్దనే తన వాహనాన్ని నిలిపివేసి నడుచుకుంటూ ఆలయంలోకి వెళ్ళారు.

జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- రిటైర్డ్ జర్నలిస్టులకు రూ.10వేలు పెన్షన్, కోవిడ్‌తో చనిపోయిన జర్నలిస్టులకు పరిహారం అందించాలి
- మంత్రి నారా లోకేష్‌కు జర్నలిస్టు సంఘాల వినతి

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన జర్నలిస్టులకు ఉచితంగా 4 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర మానవ వనరుల, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు వినతి అందజేసి ఆయనతో చర్చించారు. నగరంలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం మంత్రిని కలసి జర్నలిస్టులు ఎదుర్కొం టున్న సమస్యలను ఆయన దృష్టి తెచ్చారు. ఇతర రాష్ట్రాల్లో రిటైర్డ్ జర్నలిస్టులకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నాయని, అదే మాదిరిగా మన రాష్ట్రంలోనూ కల్పించాలని కోరారు. కోవిడ్‌తో మృతి చెందిన జర్నలిస్టులకు రూ.5 లక్షల పరిహారం, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలలో 50 శాతానికి పైగా ఫీజు రాయితీ, ప్రెస్ అక్రిడేషన్ల పెంపు, జర్నలిస్టు సంఘాలకు మీడియా అక్రిడేషన్ కమిటీలలో ప్రాతినిధ్యం, జర్నలిస్టులపై దాడుల నివారణకు హై పవర్ కమిటీలు ఏర్పాటు, స్మాల్ దినపత్రికలు, వార, పక్ష, మాస పత్రికలకు సమాచార, పౌర సంబంధాల శాఖ యాడ్స్ విడుదల తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలపై స్పందించిన లోకేష్ స్కూల్ ఫీజు రాయితీ విషయంలో కలెక్టర్లతో మాట్లాడుతానని, జర్నలిస్టులకు గృహాలు కేటాయిస్తా మని హామీ ఇచ్చారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో జర్నలిస్టులు ఉన్నారని, పరిస్థితులను బట్టి ఇతర సమస్యలను పరిశీలిస్తామని తెలిపారు. లోకేష్‌ను కలిసిన జర్నలిస్టు సంఘాల ప్రతి నిధుల బృందంలో లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ (ఎల్ఎన్‌పి) అధ్యక్షుడు వి.సత్యనారా యణ, ఐజేయూ సభ్యుడు ఆర్.రామచంద్రరావు, ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్, జాప్ ప్రధాన కార్యదర్శి కె. ఎం.కీర్తన్, ఆల్ ఇండియా స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి కమల్ కుమార్, సీనియర్ జర్నలిస్టులు బి.నారా యణరావు, సురేష్, ఏపీజేయూ అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీధర్, ఎం.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర – మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యలను పరిష్కరించాలని 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పివి సురేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కౌన్సిల్ మూడవ రోజు సమావేశంలో భాగంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లలో వినియోగించే ఫెర్రిక్ఆలమ్ నిమిత్తం అధిక ధరను వెచ్చించటంతో పాటుగా అవసరానికి మించి వాటిని కొనుగోలు చేస్తున్నారని దానిపై అధికారులు వివరణ ఇవ్వాలని కోరారు. అదే విధంగా పారిశ్రామిక ప్రాంతంలో ఎసిఇ పైపులైన్ల ద్వారానే మంచినీటి సరఫరా జరుగుతున్న కారణంగా ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. అందువల్ల ఎసిపి పైపులైన్లను మార్చాలని దానితో పాటు విద్యుత్ కోతలతో సంబంధం లేకుండా నిరంతర పంపింగ్ జరిగేలా పంపింగ్ స్టేషన్లలో జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. వచ్చే కౌన్సిల్ సమావేశంలోపు ఆయా సమస్యలను పరిష్కరించాలని సురేష్ విజ్ఞప్తి చేశారు.

పదవీ విరమణ హోంగార్డుకు చెక్కు అందజేత

విశాలాంధ్ర – విశాఖ క్రైమ్: విశాఖపట్నం సిటీ హోంగార్డ్స్ యూనిట్ నందు హోం గార్డుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన పీల జగన్నాథరావు సంక్షేమం నిమిత్తం హోం గార్డులు తమ ఒక్క రోజు వేతనం రూ.6,94,380/- (ఆరు లక్షల తొంబై నాలుగు వేల మూడువందల ఎనబై రూపాయలను)ను సీపీ చేతుల మీదుగా అందజేసారు.

శరన్నవరాత్రి పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర – విశాఖపట్నం: ఆలయ అధ్యక్షులు మార్గాన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రాంనగర్‌లో వెలసిన దుర్గా మల్లేశ్వర ఆలయం దగ్గర దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా దుర్గా దేవి ఉత్సవాలు పోస్టర్ నగర పోలీస్ కమిషనర్ ఆవిష్కరించారు. దుర్గాదేవి శరన్నవ రాత్రి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంఘ కన్వీనర్ రాజు గౌడ్ యాత, నెక్కెళ్ళ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

2వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం

విశాలాంధ్ర – భీమిలి: భీమిలి జివిఎంసీ జోన్–1లోని 2వ వార్డ్ పరిధిలో ఉన్న ఆదర్శనగర్–02 సచివాలయం పరిధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలతో గ్రామ సభ నిర్వహిస్తూ 100 రోజులలో ప్రభుత్వం చేసిన మంచి పనులు కోసం చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి, 2వ వార్డు కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మీ, టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పాదయాత్ర హామీలు అమలు చేయండి
అసైన్డ్ భూములు కాపాడండి
లోకేష్‌కు విదసం వినతి

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని విదసం ప్రతినిధులు మంత్రి లోకేష్‌ను కోరారు. కోడి కత్తి కేసు, కాకినాడ వీధి సుబ్రమణ్యం హత్య కేసు, డాక్టర్ సుధాకర్ కేసు రాష్ట్ర ప్రభుత్వం పునః సమీక్ష చేయాలని, ఎస్సీల ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూములు ఇన్సైడ్ ట్రేడింగ్‌పై విచారణ చేపట్టాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌కు విదసం నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్‌కు దళితుల సమస్యలను విదసని కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు వివరించారు. పాదయాత్రలో దళితులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం దృష్టి సారించి న్యాయం చేయాలని, కోడి కత్తి శ్రీనును విదసం పోరాడి బయటకు తెచ్చినప్పటికీ కేసు ఎన్ఐపి చేతిలో ఉండి పోయిందని, ఎన్ఐఎ దర్యాప్తులో కుట్రకోణం లేదని తేల్చినందున కేసును ఎన్ఐఎ యాక్ట్ 7 (3) ప్రకారం ఏపి పోలీసులకు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ అనంత బాబు చేతిలో హత్యకు గురైన వీధి సుబ్రమణ్యం కేసును ఆనాటి ఎస్పీ రవీంద్ర బాబు నిందితుడుకి అనుకూలంగా మలచి ముద్దాయి బెయిల్ మీద వుండి సాక్ష్యాలు తారుమారు చేస్తున్నాడని తెలిపారు. ఈ కేసును పున: విచారణ చెయ్యాలని కోరామన్నారు. ఆంధ్ర యూనివర్శిటీకి 30 ఏళ్లుగా దళితుడు వీసీ కాలేదని రాజకీయాలతో సంబంధం లేని అర్హత కలిగిన ప్రొఫెసర్‌ను విసిగా నియమించాలని కోరారు. ఉత్తరాంధ్రలో ఇన్సైడ్ ట్రేడింగ్ జరిగిన 2 వేల ఎకరాలు ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూముల బదలాయింపు నిలుపుదల చేయాలని, విద్యా దీవెన, అంబేద్కర్ విదేశీ విద్యా పథకం బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈతల పాక సుజాత, జాజి ఓంకార్, కస్తూరి వెంకటరావు, బూల భాస్కరరావు, రవి సంతోష్, ములంపాక అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్

విశాలాంధ్ర – గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ స్థానిక నేవల్ సైన్స్ టెక్నలాజికల్ లాబొరేటరీలో ఎస్.హెచ్.ఎస్ –2024 ప్రచారం నిర్వహిస్తోంది. అక్టోబర్ 02న మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ దివస్‌గా పాటిస్తున్నారు. దానికి నాందిగా, స్వచ్ఛ భారత్ కోసం స్వచ్ఛంద వాదం, సామూహిక చర్యను బలోపేతం చేయడానికి, 2017 నుండి పక్షం రోజుల పాటు 'స్వచ్ఛత హి సేవా' నిర్వహించబడింది. ఎన్ఎస్‌టిఎల్ స్వచ్ఛతా కాల్‌కు అపూర్వ స్పందన లభించిందని డాక్టర్ అబ్రహం వరుగీస్ ప్రశంసించారు. ఈ స్వచ్ఛతా కార్యకలాపాలు డైరెక్టర్ ఎన్ఎస్‌టిఎల్ పర్యవేక్షణలో సిహెచ్‌వి సత్య శ్రీనివాస్, శాస్త్రవేత్త 'జి' ద్వారా నిర్వహించబడుతున్నాయి. మిథిలేష్ కుమార్ సాహు, శాస్త్రవేత్త 'ఎఫ్'బీ లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్, బి.ఆర్.ఎస్.కె సేథ్, టెక్నికల్ ఆఫీసర్ 'సి', ఎన్.ఎస్.టి.ఎల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు, వర్క్స్ కమిటీ సభ్యులు, ఇతర వ్యక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

న్యూ లైఫ్ పాఠశాల ఔదార్యం

విశాలాంధ్ర – ఆనందపురం: ప్రకృతి వైపరీత్యాల వల్ల భారీ నష్టాలు చవిచూసిన కేరళ వయనాడ్, విజయవాడ బుడమేరు బాధితులకు న్యూ లైఫ్ పాఠశాల వారు తమ వంతుగా నగదును అందజేశారు. వివరాల్లోకి వెళితే ఆనందపురం మండలం, గొట్టిపల్లి గ్రామంలో ఉన్న న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, న్యూ లైఫ్ విద్యాసంస్థల వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున విజయవాడ / వయనాడ్ (కేరళ) వరద బాధితుల సహాయార్థం ఒక లక్ష పన్నెండు వేల రూపాయలు ఫండ్‌ను యాజమాన్యానికి అందజేసి వారి ఔదార్యాన్ని చాటి చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కె.శ్యామ్ మాథ్యూస్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు వరద బాధితుల కోసం నిధులు సేకరించడాన్ని అభినందించారు. తమ సంస్థ ద్వారా సేకరించిన మొత్తాన్ని బాధితులకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయశ్యామ్, ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ వేదికగా నేడు ఇండస్ట్రీ మీట్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఇండియా కెమ్ - 13వ ద్వైవార్షిక అంతర్జాతీయ ప్రదర్శన, సమావేశంలో భాగంగా ఫిక్కీ ఆధ్వర్యంలో విశాఖపట్టణం వేదికగా శుక్రవారం ఇండస్ట్రీ మీట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 1.00 వరకు ఈ మీట్ జరుగుతుందని, వివిధ కంపెనీల ప్రతినిధులు భాగస్వామ్యమై వివిధ అంశాలపై చర్చించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్ విచ్చేస్తున్నారని తెలిపారు. ఔత్సాహికులను ప్రోత్సహించ డమే లక్ష్యంగా విశాఖపట్నంలోని నోవోటెల్ హోటల్లో శుక్రవారం ఉదయం నుంచి ఇండస్ట్రీ మీట్ నిర్వహిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

అసైన్మెంట్ ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 1990 నుంచి 97 వరకు గతంలో ఎస్సైన్మెంట్ కమిటీలు రాష్ట్ర మొత్తం మీద అప్పట్లో ఉండేవి. ఇందులో అన్ని రాజకీయ పార్టీలు నుండి సభ్యులుగా ఉండేవారు ఆర్డిఓ అధికారి చైర్మన్గా స్థానిక శాసనసభ్యులు కన్వీనర్గా ఉండేవారు అప్పట్లో ఏ ఒకటైన భూములు కేటాయించడం కాలనీలో ఏర్పాటు చేయుటకు గాను అప్పటి అసైన్మెంట్ కమిటీ ఆమోదం తెలిపితే గాని పనులు జరిగేవి కాదు. కానీ ఇప్పుడు అక్రమాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిదారులకి పౌర సరఫరాల ద్వారా రేషన్ సరుకులు అందుతున్నది, లేనిది ఫుడ్ కమిటీ పర్యవేక్షించేవారు. ఆర్డిఓ, ఎమ్మెల్యే కన్వీనర్లుగా ఉండేవారు. మండల పరిషత్ చైర్మన్, జిల్లా పరిషత్ నెంబర్ కూడా ఇందులో భాగస్వాములుగా సభ్యులుగా ఉండేవారు అలాగే ఈ కమిటీలు మండలాల వారీగా ఉండేవి కావున ఓటమి ప్రభుత్వంలో అక్రమాలు జరగకుండా ఉండే దానికి ప్రస్తుత విధానంలో ఎస్సైన్మెంట్ కమిటీ రేషన్ బియ్యం ప్రక్క దారి పట్టకుండా ఉండేందుకు ఫుడ్ కమిటీ ఏర్పాటు చేయాలని మాజీ అసైన్మెంట్ కమిటీ మెంబర్ కిలాని శ్రీనివాస్ తెలిపారు.

తిరుపతి లడ్డును రాజకీయం చేయడం తగదు

విశాలాంధ్ర - ఆనందపురం: అతి పవిత్రమైన శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూను రాజకీయ దుర్బుద్ధితో కావాలని అబద్దాలాడి జంతువుల కొవ్వు తో కల్తీ జరిగినట్లుగా అసత్య ప్రచారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యనారాయణ పేర్కొన్నారు. ఈనెల 28న శనివారం బోయపాలెం పైడా కళాశాల నందు గల వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఆనందపురం మండలంలో గల నాయకులందరూ హాజరై పూజలు నిర్వహించాలని కోరారు.

ప్రకృతిఫల రైతు ఉత్పత్తి దారుల మహాజన సభ

విశాలాంధ్ర - పెందుర్తి: మండలం పినగాడి గ్రామంలో గల ప్రకృతిఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఐదవ సర్వసభ్య మహాజన సభ గురువారం జరిగింది. దీనికి ముఖ్య అతిధిగా జాగృతి మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత హాజయ్యారు, ప్రకృతిఫల రైతు సంఘన్ని స్వర్గీయ కందర్ప రామకృష్ణ స్థాపించినప్పటి నుంచి నేటికీ లాభాల బాటలో పయనిస్తుందని, వచ్చే సంవత్సరం అద్దె ఆఫీస్ లో కాకుండా హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్ లో జరుపుకోవాలని దానికి బోర్డు సహకరించి స్థలంను ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దుర్గ ప్రసాద్, కంపెనీ చైర్మన్ వెన్నెల పెంటబాబు, కంపెనీ సీఈవో ప్రవీణ్ కుమార్, అగ్రికన్సలేటెంట్ వి.రెడ్డినాయుడు పాల్గొన్నారు.

కృష్ణా కాలనీలో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం జోన్ మూడవ వార్డు కృష్ణా కోలనీ బస్ స్టాప్ వద్ద గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో కిరాణా దుకాణం పూర్తిగా దగ్ధమవడంతో పాటు పక్కనే ఉన్న మరో టైలరింగ్ దుకాణం పాక్షికంగా కాలిపోయింది. వి.తౌడు అనే వ్యక్తికి సంబంధించిన కిరాణా దుకాణం కాలిపోవడంతో సుమారు రూ.5 లక్షలు వరకు ఆస్తి నష్టం జరిగినట్లు షాప్ యజమాని తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐలు గౌరీ, జి.హరీష్లు పరిశీలించారు.

ఇది మంచి ప్రభుత్వంలో ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి జంక్షన్ తాండ్రపాపారాయుడు కళ్యాణమండపంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, భారతీయ జనతా పార్టీ ఇంచార్జ్ గొర్లె రామనాయుడు, స్పెషల్ ఆఫీసర్ శేష శైలజ,



జీవీఎంసీ జోనల్ కమిషనర్ హైమావతి, 96వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగి వరమేశ్వరరావు, 96వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు దాడి సంతోష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నారాయణరావు ,సేనాపతి సోమశేఖర్, రాజేంద్రప్రసాద్, పీలా జితేంద్ర, రమేష్, రాము, గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ 100 రోజులలో ప్రభుత్వ పాలనను వివరించారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. దీనితో ఆయన టిడిపి శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్న మొదటి వ్యక్తిగా నిలిచారు. గురువారం నగరంలోని టిడిపి కార్యాలయంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో లక్ష రూపాయలు శాశ్వత సభ్యత రుసుము డిడి ని మంత్రి నారా లోకేష్ కు ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి తదితరులు ఉన్నారు.

జాతీయ అర్బన్ కన్వెన్షన్ సమావేశంలో నగర డిప్యూటీ మేయర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో జీవన నాణ్యతను మెరుగుపరచడానికి మరియు వాటిని మరింత స్థిరంగా మార్చడానికి ప్రజా జాతీయ అర్బన్ కన్వెన్షన్ సమావేశం అద్భుతమైన వేదిక అని నగర డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ అన్నారు. గురువారం దేశ రాజధాని ఢిల్లీలో ప్రజా జాతీయ అర్బన్ కన్వెన్షన్ 2024 సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇదే వేదికపై భారతదేశంలో అనేక రాష్ట్రాలకు సంభందించిన నగరపాలక సంస్థ మేయర్లు, డిప్యూటీ మేయర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల పరిధిలో ఉన్న నగరాలలో ప్రజలు నివసిస్తున్న తీరు, వారి జీవన విధానాల మేరుగుపరిచే దిశగా తీసుకోవలసిన జాగ్రత్తలు సరైన రీతిలో అమలుజరిగిన రోజు భారతదేశం పొరుగు దేశాల ఆర్థిక వ్యవస్థ జీవన ప్రమాణాలకు ధీటుగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జార?ండ్, ఛతిష్ ఘడ్, షిల్లాంగ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు హాజరయ్యారని ఒక ప్రకటన ద్వారా డిప్యూటీ మేయరు తెలిపారు.

దేవీ నవరాత్రుల రాట ఉత్సవం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: శ్రీ దుర్గ బాంబ ఆటో స్టాండ్ ఎన్టీఆర్ సెంటర్లో దుర్గా దేవి నవరాత్రుల రాట కార్యక్రమం మొల్లి రమణబాబు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పులి రమణారెడ్డి దంపతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 75 వార్డ్ అధ్యక్షులు నమ్మి అప్పారావు, శాలిని ఈశ్వరరావు, సారీపిల్లి పెంటారావు, మొల్లి నరసింగరాజు, నక్క రమణ, నమ్మి చిన్న, మొల్లి సింహాద్రి, నక్క అప్పలస్వామి, నక్క శ్రీను, కొండబాబు, మొల్లి రమణ, పాములు తాతారావు, మొల్లి ఈశ్వరరావు, ఎలమంచిలి అప్పలరాజు, సింహాచలం పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన హెరిటేజ్ వాక్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 27న జరగబోయే ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని చారిత్రక ప్రదేశాల, కట్టడాల ప్రాశస్త్యాన్ని, విశిష్టతను తెలిపే విధంగా హెరిటేజ్ వాక్ పేరుతో చేపట్టిన ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. జిల్లా టూరిజం కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెరిటేజ్ వాక్ గురువారం ఉదయం టౌన్ హాలు వద్ద ప్రారంభమై పలు ప్రాంతాల మీదుగా సాగింది. ఈ క్రమంలో టూరిజం అధికారులంతా కలిసి సంబంధిత పోస్టర్లను, గోడపత్రికలను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతను గుర్తించాలని, గౌరవించాలని నినదించారు. భవిష్యత్తరాలకు వాటిని అందించాలని సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవంలో అందరూ భాగస్వామ్యమై విజయవంతం చేయాలని ర్యాలీలో భాగంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస ఫణి, జిల్లా పర్యాటక అధికారి జ్ఞానవేణి, ఏపీటీడీసీ ఈఈ రమణ, కౌన్సిల్ సభ్యులు, అధికారులు తదితరులు భాగస్వామ్యమయ్యారు.

ఎస్ఐపిలపై వైట్ఓక్ క్యాపిటల్ మ్యూచువల్ ఫండ్ నివేదిక

విశాలాంధ్ర-విశాఖపట్నం: సిస్టమాటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ (ఎస్ఐపి) ను మార్కెట్ సైకిల్ ఎగువన ప్రారంభించడం లేదా దిగువన ప్రారంభించడంలలో ఏది మంచిది?' అనే శీర్షికతో వైట్ఓక్ క్యాపిటల్ ఏఎంసి యొక్క మునుపటి ఎస్ఐపి నివేదికకు కొనసాగింపుగా, కంపెనీ ఎస్ఐపి ఎగువనా లేదా దిగువనా?" పై మరిన్ని అంతర్దృష్టులతో ముందుకు వచ్చింది. బి ఎస్ఈ సెన్సెక్స్ టీఆర్ఐ (గత 27 కి పైగా సంవత్సరాలు) యొక్క దీర్ఘకాలిక డేటాను ఉపయోగించి వివరణాత్మక విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక రూపొందించ బడింది. ఈక్విటీ మార్కెట్ దాని ఎగువ నుండి 20 శాతం కంటే ఎక్కువ పడిపోయిన అన్ని కాలాలను పరిగణనలోకి తీసుకుంటుంది. దిగువ పట్టిక ఇద్దరు పెట్టుబడిదారుల పెట్టుబడి సారాంశాన్ని సూచిస్తుంది, ఒకరు వివిధ మార్కెట్ సైకిల్ ఎగువన రూ. 10,000 నెలవారీ ఎస్ఐపీ ను ప్రారంభించారు మరొకరు దిగువన ప్రారంభించారనే అంశాలపై వైట్ వోక్ వివరాలు వెల్లడించింది.

విశాఖలో జోరు వాన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: బంగాళాఖాతంలో అల్పపీడన ఆవర్తనం ప్రభావంతో గురువారం ఉదయం నుండి ఉత్తరాంధ్ర జిల్లాల్లో జోరువాన కొనసాగింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లన్నీ చెరువుల మారిపోయాయి. వన్ టౌన్ ప్రాంతం వరద నీటితో నిండిపోయింది. మధ్యాహ్నం వరకు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగర శివారు ప్రాంతాల్లో వరద నీరు ప్రభావం అధికంగా ఉండడంతో రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. విశాఖ జిల్లాలో 22.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. గురువారం రాత్రి కూడా ఏకధాటిగా కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. ఇటీవల వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో, కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

ఆదర్శ్ కళాశాలలో హిస్టరీ గెస్ట్ లెక్చర్

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో హిస్టరీ గెస్ట్ లెక్చర్ జరిగిందని ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా తెలియజేశారు. ఆంధ్ర యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఎం.పీ సాయి దుర్గ ప్రసాద్ ఆధునిక భారతదేశ చరిత్ర గురించి డిజి సెమినార్ హాల్లో గెస్ట్ లెక్చర్ ఇచ్చారని తెలిపారు. చరిత్ర భవిష్యత్తుని ఎలా మార్చింది, చరిత్ర ప్రాముఖ్యత మొదలగు విషయాలను బోధించారు. ఈ గెస్ట్ లెక్చర్ కు బిఎ తృతీయ, మొదటి సంవత్సరం, బీఎస్సీ, బిసిఎ, బిబిఎ, బీకాం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ. శ్రీనివాస్ రావు, ఫిజికల్ డైరెక్టర్ వరప్రసాద్ పాల్గొని చరిత్ర అనేది సమాజానికి ఎంత ఉపయోగకరంగా వుంటుందో వివరించి, చరిత్ర లేని మానవ జీవితాన్ని ఊహించుకోలేమని విశదీకరించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ టి. థియోఫిలస్ గెస్ట్ లెక్చర్ ఎం.వీ. సాయి, హిస్టరీ డిపార్ట్మెంట్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసారు.



ఉమ్మడి విశాఖ జిల్లాల వైసీపీ అధ్యక్షులు నియామకం

విశాఖ జిల్లా అధ్యక్షుడిగా గుడివాడ అమర్నాథ్
అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా బూడి ముత్యాల నాయుడు
అల్లూరి జిల్లా అధ్యక్షులుగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా ఓటమి పాలైన నేపథ్యంలో ఆ పార్టీ అధినేత జిల్లాల్లో పార్టీ కి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై సమర్థత కలిగిన నాయకుడితో వైసిపి ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు ఆ పార్టీ అధినేత జగన్ నాయకులకు దిశ నిర్దేశం చేశారు. అందులో భాగంగా గురువారం రాష్ట్రంలో నాలుగు జిల్లాలకు వైసీపీ నూతన అధ్యక్షులను నియమించారు. విశాఖ జిల్లా అధ్యక్షులుగా మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ను నియమించగా, అనకాపల్లి జిల్లాకు మాజీ మంత్రి బూడి ముత్యాల నాయుడు ను నియమించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఎమ్మెల్యే మత్స్యరాజు విశ్వేశ్వర్ రాజును నియమించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే మల్ల విజయప్రసాద్ ను నియమించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యే టికెట్ ఆశించిన మల్లా విజయప్రసాద్ ను కాదని, విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనందకు ఇచ్చారు. ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలైన నేపథ్యంలో ఈ నియోజకవర్గంలో మళ్లీ మల్ల విజయప్రసాద్ కి సమన్వయకర్తగా అవకాశం కల్పించారు. వైసీపీ పీఏసీ సభ్యురాలుగా, రాష్ట్ర ఎస్టీ విభాగం అధ్యక్షురాలుగా పాడేరు మాజీ ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి ని నియమించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వైసీపీ నేతలతో ప్రజాప్రతినిధులతో ఆ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి గురువారం తాడేపల్లి లో భేటి అయ్యారు. 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం వైఫల్యం పై , సూపర్ సిక్స్ హామీలు అమలు కోసం ప్రజల పక్షాన పోరాటం చెయ్యాల్సిన అవసరం ఉందని జగన్ దిశా నిర్దేశం చేరారు.

ప్రభుత్వ మోడల్ ఐటీఐలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: గాజువాక గవర్నమెంట్ మోడల్ ఐటిఐలో రూ.34 లక్షల సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటుచేసిన కంప్యూటర్ ల్యాబ్ను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం గాజువాక గవర్నమెంట్ న్యూ ఐటిఐలో గురువారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద (సిఎస్ఆర్) కంప్యూటర్ ల్యాబ్ కు అయ్యే నిధులను వెచ్చించడం ఆనందంగా ఉందని అన్నారు. గత కలెక్టర్ రూ. 32 లక్షల నిధులు అంచనాతో ఈ కార్యక్రమానికి పిలుపునివ్వగా, కోరమాండల్ సంస్థ రూ. 34 లక్షలు ఖర్చు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆ కలెక్టర్ చేసిన మంచి పనిలో తాము భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని తెలిపారు. కోరమాండల్ సంస్థ స్ఫూర్తితో మరిన్ని సంస్థలు, పారిశ్రామికవేత్తలు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద మంచి కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకురావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కంప్యూటర్ ల్యాబ్ లో ఉన్న అన్ని కంప్యూటర్లను విద్యార్థులు నిత్యం వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఐటిఐ అధికారులను కోరారు. కంప్యూటర్ తో సాంకేతిక పరిజ్ఞానాన్ని, వృత్తి నైపుణ్యాలను పెంపొందించు కోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్, యూనిట్ హెడ్ ఎం. జ్ఞాన సుందరం, సిఎస్ఆర్ హెడ్ సి.జయగోపాల్, హెచ్ఆర్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు, ఐటిఐ రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, 65వ వార్డు కార్పొరేటర్ బి.నరసింహ పాత్రుడు, కోరమాండల్ ,ఐటిఐ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎల్ఎం బృందానికి అధికారులు సహకరించాలి

జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాకు విచ్చేసిన జాతీయ స్థాయి పర్యవేక్షణ (ఎన్ఎల్ఎం) బృందానికి సహకరించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్ఎల్ఎం బృందం సభ్యుల క్షేత్ర స్థాయి పర్యటనపై గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, డ్వామా, ఎంపీడిఓలు, సంబంధిత అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పంచాయతీ స్థాయిలో అమలయ్యే కేంద్ర ప్రభుత్వ పథకాల తీరుపై బృందానికి వివరించాలని చెప్పారు. జిల్లాలో రోజుకు రెండు పంచాయితీల్లో ఐదు రోజులు పాటు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, లబ్ధిదారులతో మాట్లాడి పథకాల అమలుతీరును తెలుసుకుంటారని అన్నారు. అలాగే దిశా కమిటీ లను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. కావున గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, డ్వామా, ఎంపీడిఓలు, సంబంధిత అధికారులు సమన్వయం చేసుకొని, బృందానికి సహకరించాలని కోరారు. తొలుత కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆనంద పురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో పథకాలు అమలయ్యే తీరుపై జేసీ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఎ పీడీ ఎం.ఎస్.శోభారాణి, జెడ్పి సీఈఓ డి.సత్యనారా యణ, డీపిఓ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్.ఈ కె. శ్రీనివాసరావు, ఎల్డిఎం ఎం. శ్రీనివాస్,ఎస్బిఐ ఆర్సేటి డైరెక్టర్ బి.విజయకుమార్, డ్వామా ఏపిడీలు కె.ఉషా రాణి, కె.ఆంజనేయులు, ఎంపీడిఓలు ఎం.విజయ కుమార్, హనుమంతరావు, కె.వెంకయ్య,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీ తెలుగులో సరిగమప సీజన్ 16

ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్ లాంచ్

విశాలాంధ్ర -విశాఖపట్నం: జీ తెలుగు సరిగమప తన సరిగమప సీజన్ -16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ ఈ నెల 29న, సాయంత్రం 6 గంటలకు, అక్టోబర్ 6 నుండి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రసారమవుతుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన గాయకులకు ప్రోత్సహించే లక్ష్యంతో డ్యాన్సింగ్, సింగింగ్ షోలతో మట్టిలో మాణిక్యాలను జీ తెలుగు గుర్తిస్తుందన్నారు. ఇందులో భాగంగానే విజయవంతంగా 15 సీజన్లు పూర్తి చేసుకున్న సింగింగ్ షో 'స రి గ మ ప' కొత్త సీజన్ ప్రారంభం కానుందన్నారు. ఈ సీజన్లో గాయనీ గాయకులు విలేజ్ వోకల్స్, సిటీ క్లాసిక్స్, మెట్రో మెలోడీస్ అనే మూడు జట్లుగా పోటీపడతారాన్నారు. ఈ జట్లకు మెంటర్లుగా రేవంత్, రమ్య బెహరా, అనుదీప్ దేవ్ నాయకత్వం వహిస్తారన్నారు. ఈ సీజన్ కు ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుండగా, సంగీత దర్శకుడు కోటి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, పాటల రచయిత కాసర్ల శ్యామ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు.

జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ - అనురాధ గూడూరు మాట్లాడుతూ, "యువ, అసాధారణ ప్రతిభావంతులకు ఎల్లప్పుడూ లాంచ్ ప్యాడ్ గా ఉన్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ప్రతి సీజన్ మాదిరిగానే ఈ సీజన్లోనూ ప్రతిభావంతులైన గాయనీ గాయకులను ప్రోత్సహించడమే మా లక్ష్యమన్నారు. ఇప్పటికే మనం చూసిన ఎనర్జీ, ప్యాషన్, టాలెంట్ చెప్పుకోదగ్గవన్నారు. తమ కలలను నిజం చేసుకోవడమే కాకుండా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చే ఓ వేదికను అందించడమే మా ఉద్దేశమన్నారు. ఈ సీజన్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నామంటూ ధీమా వ్యక్తం చేశారు.

ఆలయాలను ఆధ్యాత్మిక శోభ వెదజల్లేలా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆలయాలను ఆధ్యాత్మిక శోభ వెదజల్లేలా తీర్చిదిద్దాలని దక్షిణ ఎమ్మెల్యే, జనసేన నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డు అపవిత్రమైన కారణంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దీక్షకు మద్దతుగా గురువారం వెంకటేశ్వర మెట్ట వద్ద గల బలిగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో సంప్రోక్షణ చేసి, శుద్ధి చేశారు. తిరుమల లడ్డు వార్త ప్రపంచం లో ఉన్న భక్తులు ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు.రాష్ట్రం లో అనేక దేవాలయాల తో పాటు , సింహాచలం దేవాలయం లో వైసిపి నిర్లక్ష్య వైకిరి బయటపడిందని అన్నారు. దేవాలయాల ను ఆధునీకరణ చేసి, ఆధ్యాత్మిక శోభ వెదజల్లే లా తీర్చిదిద్దాలి అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి ,జనసేన, బిజెపి రాష్ట్ర నాయకులు, కార్పొరేటర్లు, ఇన్చార్జి లు, వార్డ్ అధ్యక్షులు,కూటమి నేతలు పాల్గొన్నారు. అనంతరం 34వ వార్డులో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్కి ఆలయ కమిటీ సభ్యులు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, స్థానిక నాయకులు, టిడిపి ,జనసే,న బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్వీపీఈఐలో ఐఐహెచ్ వ్యాధిపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-విశాఖపట్నం: ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్టెన్షన్ (ఐఐహెచ్)ను అర్థం చేసుకోవడానికి, అవగాహన కోసం నగరంలోని జీఎంఆర్ వరలక్ష్మి ప్రాంగణం దరి ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ లో వ్యాధి పై పూర్తి వివరాలతో గురువారం వెద్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎల్వీపీఈఐ పీడియాట్రిక్, న్యూరో-ఆఫ్తల్మాలజిస్ట్ డాక్టర్ వీరేందర్ సచ్ దేవా మాట్లాడుతూ ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్టెన్షన్ (ఐఐహెచ్) ముఖ్యంగా గర్భధారణ వయసు (సాధారణంగా 20-50 సంవత్సరాల వయస్సు) ఉన్న స్త్రీలలో, ఊబకాయం, కంటినరం సమస్యలు ఉన్న వ్యక్తులలో ఎక్కువ ప్రబలంగా ఉంటున్నదన్నారు. స్టెరాయిడ్లు, విటమిన్ ఎ సప్లిమెంట్లు, నోటిద్వారా తీసుకునే గర్భనిరోధక మాత్రలు, దీర్ఘకాలం పనిచేసే టెట్రాసైక్లిన్స్ (యాంటీబయాటిక్స్) అధిక ఉపయోగం, ఊబకాయ ప్రాబల్యం, వీటితో పాటు ఉండే రక్తహీనత పోలిసిస్టిక్ ఓవేరియన్ వ్యాధి- ఇవన్నీ ఐఐహెచ్ కేసుల సంఖ్య పెరుగుదలకు కారణమవుతున్నాయన్నారు.

పొలిటికల్ ఈవెంట్కి తెరలేపిన జగన్

విశాలాంధ్ర - భీమిలి: తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి కలిపి తిరుమలను అపవిత్రం చేసింది చాలదన్నట్లు ఆలయాల్లో పూజలు చేయండని వైసిపి కేడర్కి పిలుపునివ్వడంపై టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విస్మయం వ్యక్తం చేసారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. వైసిపీ ఐదేళ్ల పాలనలో తిరుపతినే కాకుండా రాష్ట్రంలో ఉండే అన్ని దేవాలయాలను భ్రష్టు పట్టించారని అన్నారు. అంతే కాకుండా ప్రధమ దేవాలయాల్లో భక్తులకోసం ఏర్పాటు చేసిన అన్నధానాల్లోని, లడ్డూ ప్రసాదంలోను కమీషన్లకు కక్కుర్తి పడి జంతువుల కొవ్వుతో తయారు చేసిన నెయ్యి వాడి చేయరాని తప్పులు చేసి ఇప్పుడు కాకమ్మ కబుర్లు చెబుతున్నారని దుయ్యభట్టారు. దెయ్యాలు వేదాలు అల్లడం అంటే ఇదేనేమో అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా రాష్ట్రంలో అనేక దేవాలయాపలపై దాడులు జరిగాయని గుర్తు చేసారు. అంతర్వేదిలో రధం తగులబెట్టారని, రామతీర్థాలలో శ్రీరాముని విగ్రహాన్ని ధ్వంశం చేశారని ఇలా అనేక దేవాలయాలపై దాడులు చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీశారని అన్నారు. ఇలా ఒకటా రెండా చెప్పుకుంటూపోతే చేసిన నిర్వాహకాలు చాలా ఉన్నాయని అన్నారు. అవన్నీ కాకుండా ఇప్పుడు తిరుపతి లడ్డూ వ్యవహారం బయటపడేసరికి ఆలయాల్లో పూజలు చేయాలని చెప్పడం రాష్ట్రంలో పొలిటికల్ ఈవెంట్ కి తెరతీశారని అన్నారు. మీరు చేసిన తప్పులకు దేవుడు 11వ రూపంలో శిక్ష వేసాడని అయినా బుద్ధి రావట్లేదని అన్నారు.